క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్



దెందులూరు తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ

దెందులూరు : దెందులూరు తహసీల్దార్ కార్యాలయాన్ని డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్యను కార్యాలయం విభాగాల ఉద్యోగులు, విధి నిర్వహణ, సమస్యలు ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినట్లు డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ అన్నారు.

కుష్టు నివారణకు ప్రత్యేక ప్రణాళిక

దెందులూరు: కుష్టు వ్యాధి నివారణకు ప్రత్యేక ప్రణాళికతో పాటు పక్షోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని స్టేట్ కోఆర్డినేటర్ ఎం.రాధిక అన్నారు. గురువారం లెప్రసీ సొసైటీ ఆధ్వర్యంలో డానియల్ లెప్రసీ సెంటర్ వేగవరంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు పౌర సంరక్షణ శిబిరం, కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహించారు. సంస్థ ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వహీద్ మాట్లాడుతూ 15 రోజులు లెప్రసీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పాదరక్షలు, అల్సర్ కిట్లు పంపిణీ చేశారు. ఫిజియోథెరపీ ఆర్కే కోసల, ఓఆర్‌డబ్ల్యూ రాణి తదితరులున్నారు.

కొఠారు పరామర్శ

పెదవేగి : పెదవేగిలో మృతి చెందిన కందుల వెంకటేశ్వరరావు భౌతిక కాయాన్ని మంగళవారం ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనా వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. భౌతికకాయానికి పూలమాలలు వేసి మౌనం పాటించి నివాళులర్పించారు. గార్లమడుగులో అనారోగ్యంతో బాధపడుతున్న జిజ్జువరపు భుజాలను కొఠారు రామచంద్రరావు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

ఇంటర్న్‌షిప్ కోసం ఓటీపీ టెక్నాలజీస్‌తో ఒప్పందం

ఉంగుటూరు: విద్యార్థుల ఇంటర్న్‌షిప్ నిమిత్తం నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఏలూరు ఓ.టీ.పీ టెక్నాలజీస్ వారు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరావు తెలియజేశారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగ నైపుణ్యాలు నేర్చుకునేలా శిక్షణ అందిస్తామన్నారు. ఓటీపీ టెక్నాలజీస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి జి.హరిబాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అన్ని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలతో అవగాహన ఒప్పందాలు తమ కంపెనీకి ఉన్నాయని తెలిపారు. ఇంటర్న్‌షిప్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, ఓటీపీ టెక్నాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటు

ఉంగుటూరు: యర్రమిల్లిపాడులో జగనన్న కాలనీకి వెళ్లే రహదారికి స్థల సేకరణలో భాగంగా ఇప్పుడున్న 9 అడుగుల వెడల్పు రహదారికి మరో మూడు అడుగులు రహదారి కలిపేందుకు రైతులు ముందుకువచ్చారని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. సర్పంచ్ శ్రీనివాసరావు మూడు అడుగులు రహదారికి అయ్యే ఖర్చును దానం చేయడానికి అంగీకరించినట్లు తహసీల్దారు తెలిపారు. హౌసింగు ఏఈ సురేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు కాలనీని పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

పెదవేగి : ద్వారాకాతిరుమల, కొత్తగూడెం, రామశింగవరం గ్రామ పరిసరాల్లో పులి పాద ముద్రలు గుర్తించామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్రధామ చెప్పారు. నల్లజర్ల రిజర్వు ఫారెస్టు వద్ద పులి సంచరిస్తున్నట్లు పులి పాద ముద్రల ద్వారా తెలిసిందని, పులి తిరుగు ప్రయాణంలో ఉందని గుర్తించామని, అటవీశాఖ అధికారులు తెలిపారు. సుమారు 50 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. పులి కదలికలను తెలుసుకునేందుకు బృందాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

భీమడోలు: ఏలూరు జిల్లా ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. భీమడోలులోని మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని ఉప రవాణా కమీషనర్ ఎస్.శాంతకుమారి ఆధ్వర్యంలో రహదారి భద్రత, మనందరి బాధ్యత అనే అంశంపై బస్ డ్రైవర్లు, క్లీనర్లు, విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. రహదారి నిబంధనలు, మెలకులపై వారికి అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేవీఎస్ ప్రసాద్ హాజరయ్యారు. ఎంవీఐలు జి.ప్రసాద్, ఏఎంవీఐలు ఆజ్మీరా, జి.స్వామి, వైద్యురాలు జి.మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



గణపవరం: వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: రానున్న ఎన్నికలలో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరం మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అర్ధవరం వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం వైనాట్ 175 అని, దీనిని నిజం చేయడానికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని పిలుపు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మరోసారి అధికారం అప్పగించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రతిపక్షాలు, పచ్చమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గారత్నకుమారి, మండల సచివాలయాల కార్యదర్శి ఎంఆర్‌కే, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు మాదేటి సురేష్, సర్పంచ్ గాతల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు సుభాష్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లు, గృహ సారథులు సిద్ధం కండి

పెదపాడు: దెందులూరులో ఈనెల 3న నిర్వహించనున్న సమావేశానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు, పెదపాడు, పాతముప్పర్రులో మండలంలోని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి మరో సారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరముందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్, పెదపాడు మండల కన్వీనర్ అప్పప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు గోగుంట సొసైటీ అధ్యక్షులు అక్కినేని రాజశేఖర్, భావరాజు సత్యన్నారాయణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవి కుమార్, మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, ఏపూరు సర్పంచ్ రామకృష్ణ, అప్పనవీడు సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, బెజవాడ శేఖర్, కడిమి గోవిందరావు, ఎంపీటీసీ కర్రె మరియమ్మ, ఘంటసాల ప్రభాకరరావు, పాతముప్పర్రు సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి సంతోష్‌కుమార్, ఎంపీటీసీలు, నాయకులు కోట గోవర్ధన్, కొండే లాజర్, ఇళ్లూరి విజయ్, మోషే, కొత్తూరు విమలారావు, తుమ్మల గోపాలకృష్ణ, సంబంగి శ్రావణ్ కుమార్, వీరమ్మకుంట సర్పంచ్ చంటిబాబు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

భీమడోలు: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు యుద్ధ సైనికుల్లా పని చేయాలని భీమడోలు ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ అన్నారు. దెందులూరులో ఫిబ్రవరి 3వ తేదీ శనివారం ఎన్నికల సమర శంఖారావం- ప్రాంతీయ సదస్సుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో మంగళవారం సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షుడు జంగం యోసేబు ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథులుగా ఇంజేటి నీలిమ, పుప్పాల కార్తీక్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా పాల్గొని ప్రసంగించారు. దెందులూరులో నిర్వహించే సిద్ధం బహిరంగ సభకు కొల్లేరు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆగడాలలంకలోని జగనన్న కాలనీలో మౌలిక వసతుల సమస్యను ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భలే రాంబాబు, ఎంపీటీసీ ఇంజేటి జూనియర్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి సుబ్బారావు, నాయకులు పాము వెంకటేశ్వరరావు, యాండ్రపాటి జార్జి, పెనుగొండ సామ్యూయేలు పాల్గొన్నారు.

సీఎం జగన్ సభను జయప్రదం చేయండి

ఉంగుటూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఉంగుటూరు మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు పిలుపునిచ్చారు. మంగళవారం సీఎం సభకు సన్నాహక సమావేశాలు మంగారావు ఆధ్వర్యంలో మండలంలో అక్కుపల్లి, గోకవరం, తిమ్మయ్యపాలెం, కంసాలిగుంట, నల్లమాడు, యర్రమిల్లిపాడు, గొల్లగూడెం, రామచంద్రపురం, గోపాలపురం, గోపీనాథ పట్టణం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న ఏలూరు జిల్లాలో నిర్వహించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సన్నాహక భారీ బహిరంగ సభను ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పుప్పాల గోపి, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడు ఎలిసెట్టి పాపారావు బాబ్జి, జెడ్పీటీసీ కోరిపల్లి జయలక్ష్మి శ్రీనివాసరావు, ఉంగుటూరు మండలం ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, మండల సచివాలయ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, అల్లాపురం మాజీ సర్పంచ్ పైడిముక్కల వెంకట రామకృష్ణ, సీనియర్ నాయకులు అడపా శ్రీనివాసరావు, నారాయణపురం వార్డ్ మెంబర్ నేదురు గంగాధర్‌రావు, ఎంపీటీసీ సందక రాంబాబు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



పెదపాడు: సిద్ధం కరపత్రాలను వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



భీమడోలు: ఆగడాలలంకలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ



ఉంగుటూరు: సన్నాహక సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: దేశ ప్రగతి తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందన్న ప్రగాఢ విశ్వాసంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జిల్లా పరిషత్ అందించే విజయకేతనం పుస్తకాలను, 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గోరుముద్ద పథకం, విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, నాడు-నేడు పథకం ద్వారా రూ.వేల కోట్లు ఖర్చుచేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారని కొనియాడారు. 10వ తరగతి విద్యార్థులు విజయకేతనం పుస్తకాలను వినియోగించుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో గతేడాది వట్లూరు నుంచి జిల్లా ప్రథమం సాధించారని, ఈ సారి కూడా పెదపాడు మండలంలోని విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, గ్రామ సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, మండల విద్యాశాఖాధికారులు సబ్బితి నర్సింహమూర్తి, దేవినేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ విజేతలకు బహుమతుల ప్రదానం



ఖోఖోలో ప్రథమం సాధించిన అప్పన్నపేట జట్టుకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: క్రీడాకారులు తమనైపుణ్యాన్ని పెపొందించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం నారాయణపురంలో నియోజకవర్గ స్థాయిలో విజేతలైన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే వాసుబాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభను చూపి నియోజకవర్గానికి పేరుతేవాలని కోరారు. క్రికెట్‌లో ప్రథమ స్థానంలో గణపవరం మండలం పిప్పర, ద్వితీయస్థానంలో నిడమర్రు మండలం తోకలపల్లి, తృతీయం భీమడోలు జట్లు సాధించాయి. విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. కబడ్డీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉంగుటూరు, నిడమర్రు, కేశవరం జట్లు నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గొల్లగూడెం, పూళ్ల, సీహెచ్ అగ్రహారం జట్లు బహుమతులు అందుకున్నాయి. వాలీబాల్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉంగుటూరు, పిప్పర, బావాయిపాలెం జట్లు బహుమతులు అందుకున్నారు. ఖోఖోలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అప్పనపేట, ఉంగుటూరు, పూళ్ల జట్లు బహుమతులు అందుకున్నాయి. ఎమ్మెల్యే క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, ఆర్డీవో ఖాజావల్లి, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమానివ్రత, ఆయాగ్రామాల సర్పంచలు, ఎంపీటీసీ సభ్యులు, అధికార్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు



దుద్దేపూడిలో కళ్లజోళ్లను అందిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, సర్పంచులు

భీమడోలు: దుద్దేపూడిలోని సచివాలయం వద్ద మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి రోగులు పోటెత్తారు. దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామాలకు చెందిన రోగులు అధిక సంఖ్యలో శిబిరాలకు తరలివచ్చారు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. తొలుత ఈ శిబిరాన్ని సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, కోడూరుపాడు సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ప్రారంభించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా పలువురికి కళ్లజోళ్లను అందించారు. ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతి దేవి, ఈవోఆర్డీ ఏ.సుందరి, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వసంతవాడలో ..

పెదపాడు: వసంతవాడలో జగగన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు చక్రధర్, అనంతపాల్ సర్పంచ్ చింతల రమాభారతి, ఎంపీటీసీ కలపాల ఆదిలక్ష్మి, తుమ్మల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా నిలిచాం

పెదవేగి : ఉపాధ్యాయుల అవసరాలు తెలుసుకుని వారికి అండగా నిలవడం సంతోషంగా ఉందని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ విజ్ఞప్తి మేరకు మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా సీఎల్ (క్యాజువల్ లీవ్స్) బుక్స్ స్పాన్సర్ చేసిన పెదవేగి ఎంపీపీ తాతా రమ్య దంపతులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. సహకరించిన దాతలు ప్రభావతి హాస్పిటల్ బొల్లికొండ గంగాధరరావు, జేఎంఎస్ చికెన్ సెంటర్ చిట్టిబొమ్మ జగదీష్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మండల వనరుల కేంద్రం వద్ద సీఎల్ బుక్స్‌ను ఎంపీపీ తాతా రమ్య, ఎంఈవో-2 వి.అరుణ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జి క్యాలెండర్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటీఎస్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పి వెంకటరమణ, కోశాధికారి ఎం లక్ష్మీనారాయణ, యుటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం కృషి

భీమడోలు: కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యురాలు కె.శ్రీలక్ష్మీ, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, గ్రామ కార్యదర్శి నందేటి ఠాగూర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన పెంచుకోవాలి



విజయరాయిలో ఏర్పాటు చేసిన రైతుల సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

పెదవేగి : వ్యవసాయ శాఖ విద్యార్థులు చదువుతోపాటు వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కలిగి ఉండడం ఎంతో ముఖ్యమని మార్టేరు వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం భరతలక్ష్మి తెలిపారు. మంగళవారం పెదవేగి మండలం విజయరాయిలోని సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ మార్కాపురం విద్యార్థులు ఫీల్డ్ వర్క్ నిమిత్తం లింగపాలెం మండలం, పెదవేగి మండలంలోని విజయరాయిలో రైతులతో మమేకమై వారు పండిస్తున్న పంటల విధానం తెలుసుకోవడంతోపాటు వారు వ్యవసాయానికి ఉపయోగించే ఎరువుల వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. అసోసియేట్ డీన్, ఎన్ఎస్ అగ్రికల్చరల్ కాలేజ్ మార్కాపురం డాక్టర్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి, ఏరువాక కేంద్రం ఏలూరు కోఆర్డినేటర్, డాక్టర్ సుజాత, సైంటిస్ట్ నాగేంద్రబాబు, ఏఓ ప్రియాంక పాల్గొన్నారు.

తాగునీటి పనులు సత్వరమే పూర్తి చేయాలి



ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం దృశ్యం

దెందులూరు: గ్రామ జల సంఘాలకు కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిపై మండల స్థాయి ఒక రోజు శిక్షణ తరగతులను దెందులూరు ఎంపీడీఓ శ్రీలత మంగళవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీలత మాట్లాడుతూ మండలంలో గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సమన్వయం, ప్రణాళికతో తాగునీటి పనులు సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో లక్ష్యాలు సాధించాలన్నారు. ఈఓపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, జలజీవన్ మిషన్ పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా గ్రామ జలసంఘాలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సేవలందించాలన్నారు.

మహాత్మా గాంధీజీకి ఘన నివాళి



పెదనింద్రకొలనులో గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సర్వోదయ సభ్యుల

నిడమర్రు: పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనంలో మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో 76వ గాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. సర్వోదయ అధ్యక్షురాలు చర్ల మృదుల మాట్లాడుతూ నేటి తరం నాయకులు గాంధీజీ ఆశయాలకు, సిద్ధాంతలకు అనుగుణంగా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. ముందుగా గాంధేయవాదులు, విద్యార్థులు గ్రామంలో శాంతి సేన ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీ ఆలోచనలపై 20 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. వీరిని జిల్లా సర్వోదయ మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, సహాయక కార్యదర్శి సాగిరాజు జానకిరామరాజు, పత్మమట్ల లక్ష్మీపతిరాజు, వేగేశ్న సుబ్బరాజు, తన్నీరు పరమయ్య, రుద్రరాజు బంగారాజు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- 15 పంచాయతీల్లో 74,890 మందికి మేలు
- డీబీటీ పథకాల ద్వారా రూ.159,87,42,591
- నాన్ డీబీటీ ద్వారా రూ.106,20,56,368 లబ్ధి



పైడిచింతపాడులో మహిళలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి (ఫైల్)



ప్రభుత్వం అందించిన సున్నా వడ్డీ పత్రాలు చూపుతున్న మాదేపల్లి మహిళలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో పేదల ఇళ్లలో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో అమలు చేస్తోన్న పథకాలు పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి. అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా పేదల పిల్లలు ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్నారు. వాహన మిత్ర, కాపునేస్తం, ఈబీసీ నేస్తంతో యువత ఉద్యోగం, వ్యాపారం రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల ద్వారా రైతులు వ్యవసాయం, చేపల సాగు రంగంలో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత సాయంతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

రెండు రకాలుగా పథకాల లబ్ధి

ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రెండు విభాగాలు చేసింది. ఇందులో నేరుగా నగదు రూపంలో లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు అనుసంధించిన పథకాలను డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్స్ ట్రాన్స్‌ఫర్స్) అంటోంది. వస్తు, సేవల రూపంలో అందిస్తున్న పథకాలను నాన్ డీబీటీ (ఇన్‌డైరెక్ట్ బెనిపిట్స్)గా వివరిస్తోంది.

లబ్ధిదారులు 74,890 మంది

దెందులూరు నియోజకవర్గం, ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 74,890 మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. వీరిలో 51,578 మందికి 25 డీబీటీ పథకాల (అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, రైతు భరోసా, సున్నావడ్డీ, కాపునేస్తం, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర) ద్వారా రూ.159,87,42,591 లను ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. మరో 23,312 మంది లబ్ధిదారులకు ఎనిమిది నాన్ డీబీటీ పథకాలు (ఇంటి స్థలం, విద్యా కానుక, జగనన్న తోడు, గోరుముద్ద, రైస్ కార్డు, కంటి వెలుగు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, విద్యార్థులకు ట్యాబ్స్) ద్వారా రూ.106,20,56,368 ఖర్చుకాగల సేవలు అందుకుంటున్నారు.